సాక్షి
తూర్పుగోదావరి
గురువారం | 21 | నవంబర్ | 2024



వేట నిషేధ సాయం ఏమైంది!

రోజూ సాగరంలో సమరం.. వేటే వారి జీవనాధారం.. వలకు చిక్కిన చేపలే ఆ మత్స్యకారుల జీవన గమనానికి ఆధారం..


8లో



ఉరుకులు... పరుగులు

ఏం జరిగిందో తెలియదు.. అంతా హడావుడి.. ఒక్కసారిగా అధికారుల ఉరుకులు, పరుగులు.. ఈ పరిణామాలతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో భీతావహ పరిస్థితి..

17వేల క్యూసెక్కుల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం సాయంత్రం 17,382 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు 4,700 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

అధినేతతో భేటీ



కొవ్వూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మర్యాద పూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో ఇటీవల రాజకీయ పరిణామాలను, పార్టీ పరిస్థితిని వివరించినట్లు వెంకట్రావు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ కోసం మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారన్నారు. ఈ సందర్భంగా తాళ్లపూడి ఎంపీపీ జొన్నకూటి పోశిబాబు వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో చాగల్లు ఎంపీపీ మట్టా వీరస్వామి, యాళ్ల బాబూరావు, పిట్టా శ్రీనివాసు, సిర్రా గంగారామ్, కోయ దుర్గారావు, గండి రాంబాబు, పలువురు నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

సిబ్బందికి శిక్షణలో కలెక్టర్ ప్రశాంతి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో మార్గదర్శకాల, శిక్షణ సామగ్రిపై అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఏఆర్వో, సహాయ ఎన్నికల సిబ్బందికి పోలింగ్ కేంద్రాల నిర్వహణ, పోలింగ్ రోజు విధులపై ఇచ్చిన శిక్షణకు ముఖ్య అతిథులుగా కలెక్టర్ ప్రశాంతి, డీఆర్వో టి.సీతారామమూర్తి పాల్గొన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది విధులపై స్పష్టమైన అవగాహన కల్పిస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. బ్యాలెట్ పద్ధతిలో ఈ ఎన్నిక సాగనుందని, ఫారం 16 ద్వారా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారన్నారు. బ్యాలెట్ బాక్సు, బ్యాలెట్ పేపర్, పేపర్ సీల్, మెటల్ సీల్, రబ్బర్ స్టాంప్, ఫారం 14, 15, 16పై అవగాహన కల్పించినట్టు ఆమె తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు ఆర్డీవో ఆర్.కృష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పీఎఫ్ బకాయి వసూళ్లకు చర్యలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉద్యోగి భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం పరిధిలో నవంబరు 2024 నుంచి జనవరి 2025 వరకు ప్రత్యేక వసూళ్లకు చర్యలు చేపట్టినట్టు ఈపీఎఫ్ఓ రికవరీ ఆఫీసర్ వైడీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. తమ పరిధిలోని సంస్థల నుంచి ఈపీఎఫ్ బకాయిల వసూళ్ల లక్ష్యంగా చర్యలు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఆయా సంస్థలు స్వచ్ఛందంగా నిధులు చెల్లించేలా వారితో సంప్రదించడం జరుగుతుందన్నారు.

పొగాకు సాగులో మల్చింగ్



దేవరపల్లి-పల్లంట్ల రోడ్డులో మల్చింగ్ షీట్‌పై వేసిన పొగాకు నాట్లు

దేవరపల్లి: కూలీల కొరత, కలుపు సమస్యతో ఇబ్బంది పడుతున్న పొగాకు రైతులు కొత్త విధానాన్ని అవలంబిస్తున్నారు. ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు మల్చింగ్ షీట్ వినియోగించి పొగాకు నాట్లు వేస్తున్నారు. షీట్‌పై రంధ్రాలు పెట్టి వాటిలో మొక్క నాటుతున్నారు. దీనితో పాటు డ్రిప్ ఏర్పాటు చేసి నాట్లకు నీరు పెడుతున్నారు. ఈ విధానం వల్ల పొలంలో కలుపు రాదని, అలాగే నీరు సైతం వృథా కాదని రైతులు చెప్తున్నారు. ఎకరాకు రూ.12 వేలు మల్చింగ్ షీట్, రూ.10 వేలు డ్రిప్, కూలీలకు రూ. 3 వేలు ఖర్చు అవుతుందని రైతులు చెప్పారు. దీనివల్ల పొగాకు నాణ్యత బాగుంటుందని రైతులు తెలిపారు. ఎకరాకు అన్ని ఖర్చులు కలిపి సుమారు రూ.25 వేలు అవుతుందని రైతులు చెప్పారు. 90 శాతం సబ్సిడీపై ప్రభుత్వం రైతులకు డ్రిప్ సరఫరా చేస్తున్నట్టు రైతులు తెలిపారు.



శిథిలావస్థకు చేరిన సమిశ్రగూడెం ఎస్సీ బాలికల వసతి గృహం





నిడదవోలు మండలం సమిశ్రగూడెం ఎస్సీ బాలికల వసతి గృహంలో దుస్థితి



కడియం బీసీ బాలుర వసతి గృహంలో చాలీచాలని మరుగుదొడ్లు



గోపాలపురం బీసీ హాస్టల్‌లో పెచ్చులూడుతున్న పైకప్పు



పనిచేయని వాటర్ ప్యూరిఫయర్

సంక్షోభ గృహాలు

- శిథిల భవనాల్లోనే హాస్టళ్లు
- అపరిశుభ్ర వాతావరణం, వసతుల కొరతతో విద్యార్థుల ఇబ్బందులు
- కానరాని సీసీ కెమెరాలు
- జిల్లా వ్యాప్తంగా భద్రతా చర్యలు కరవు
- ఈ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేసిన హైకోర్టు



ధవళేశ్వరం సమీకృత బాలుర వసతి గృహంలో తలుపులు లేని మరుగుదొడ్లు

సాక్షి విజిట్

సాక్షి, రాజమహేంద్రవరం: శిథిల భవనాలు.. అపరిశుభ్రతతో కూడిన మరుగుదొడ్లు.. చాలీచాలని గదులు.. దోమలతో సహజీవనం.. భోజనశాలలు లేని దుస్థితి.. మౌలిక వసతులు కరువు.. ఆపై కాస్మెటిక్ చార్జీల విడుదలతో జాప్యం.. ఇలా ఎన్నో సమస్యలు సంక్షేమ, వసతి గృహాల్లో రాజ్యమేలుతున్నాయి. పేద విద్యార్థుల సంక్షేమం, వసతితో కూడిన విద్య అందించేందుకు నెలకొల్పిన గృహాలు నిర్వహణ లోపం, ప్రభుత్వ నిర్లక్ష్యంతో అపరిశుభ్ర వాతావరణం తాండవిస్తోంది. పర్యవేక్షణ కొరవడడంతో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టిక ఆహారం కరువైపోయింది. సీసీ కెమెరాలు, ప్రహరీ గోడలకు విద్యుత్ ఫెన్సింగ్ లేకపోవడంతో భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఈ పరిస్థితులపై హైకోర్టు తీవ్ర ఆందోళన, తరచూ ఆందోళన కలిగించే భయంకర ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన చెందింది. ఇలాంటి ఘటనలపై స్పందించకపోతే భవిష్యత్ తరాలపై ఆ ప్రభావం పడుతుందని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాలపై సమగ్రంగా దృష్టి సారించాలని అభిప్రాయపడింది. విద్యార్థులు భద్రంగా, సురక్షితంగా విద్య, వసతి పొందేలా చూడాల్సిన బాధ్యత ఉందని గుర్తుచేసింది. జిల్లా వ్యాప్తంగా 'సాక్షి' చేపట్టిన ప్రత్యేక పరిశీలనలో వసతి గృహాల్లో అనేక సమస్యలు తేటతెల్లమయ్యాయి. వాటి వివరాలు ఇలా..

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా 36 ఎస్సీ సంక్షేమ వసతి గృహాలు ఉండగా.. 2,600 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఆరు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. 24 బీసీ సంక్షేమ వసతిగృహాలు ఉన్నాయి. 1,657 మంది విద్యార్థులు వీటిలో వసతి పొందుతున్నారు. ఒకటి గురుకుల పాఠశాల ఉంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న గురుకుల, కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతి గృహాల్లో అధ్వాన పరిస్థితులు దర్శనమిస్తున్నాయి. వసతి గృహాల నిర్వహణ, సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించడంతో రోగాల బారిన పడిన సందర్భాలు లేకపోలేదు. కూటమి ప్రభుత్వం సంక్షేమ, గురుకుల పాఠశాలల్లో నిర్వహణ బడ్జెట్‌ను విడదల చేయకపోవడంతో బ్లీచింగ్, ఇతర వస్తువుల కొనుగోలు చేసేందుకు ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు చేతి చమురు వదిలించుకుంటున్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మెటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో విద్యార్థులకు అత్యవసరమైన సబ్బులు, టూత్ పేస్టులు, కొబ్బరినూనె కొనుగోలు చేయడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు.

హాస్టళ్ల పరిశీలన ఇలా..

- రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం ధవళేశ్వరంలోని సమీకృత బాలుర వసతి గృహంలో 65 మంది విద్యార్థులున్నారు. ఈ వసతి గృహం కిటికీలకు తలుపులు లేవు. దోమ తెరలు సైతం లేవు. వెరసి విద్యార్థులపై దోమలు దండయాత్ర చేస్తున్నాయి. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులకు నివేదించినా ఫలితం లేదని విద్యార్థులు వాపోతున్నారు.
- కడియం బాలుర వసతి గృహంలో 27 మంది విద్యార్థులున్నారు. అవసరమైన మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న వాటికి సరైన నిర్వహణ లేక అపరిశుభ్రంగా ఉన్నాయి. అదనపు మరుగుదొడ్లకు ప్రతిపాదనలు పంపించినా అనుమతులు వచ్చిన దాఖలాలు లేవు. దోమల దండయాత్రలతో విద్యార్థులు జ్వరాల బారిన పడుతున్నారు.
- నిడదవోలు నియోజకవర్గం పెరవలి మండలంలో కానూరు ఎస్సీ బాలుర వసతి గృహంలో 80 మంది విద్యార్థులు ఉన్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి మండలం గౌరీపట్నం బాలుర వసతి గృహంలో 22 మంది విద్యార్థులున్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేవు. ప్రధాన ద్వారం వద్ద చెత్త వేయడంతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడింది. విద్యార్థులకు అవసరమైన నీటి వసతి లేదు. కిటికీలకు తలుపులు లేకపోవడంతో చలికి వణకాల్సిన దుస్థితి తలెత్తుతోంది. భవనం శిథిలావస్థకు చేరడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.
- జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరం నగరంలో వసతి గృహాల పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. బాలుర సంక్షేమ వసతి గృహంలో 98 మంది విద్యార్థులున్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో చలికాలంలో స్నానాలు చేసేందుకు అవస్థలు పడుతున్నారు.
- గోపాలపురం బీసీ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరింది. అదే భవనంలో 20 మంది విద్యార్థులు విద్య, వసతి పొందుతున్నారు. పాఠశాలకు వెళ్లాలంటే భయమేస్తోందని వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం జాతీయ రహదారిపై నడుస్తుంటే ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనన్న ఆందోళన చెందుతున్నారు. భవనాన్ని మార్చి హైస్కూల్‌కు సమీపంలో ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.
- నిడదవోలు రూరల్ సమిశ్రగూడెం ఎస్సీ బాలికల వసతి గృహంలో 36 మంది విద్యార్థినులు ఉన్నారు. భవనం సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించారు. నూతన భవన నిర్మాణానికి మూడు కోట్లతో ప్రతిపాదనలు పంపారు. 2021లో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రూ.35 లక్షలు మంజూరు చేసినా పనులు ప్రారంభం కాలేదు. హాస్టల్లో కిటికీ మెష్‌లకు రంధ్రాలు పడ్డాయి. కొన్ని ట్యూబ్‌లైట్లు, ఫ్యాన్లు పనిచేయడం లేదు. బాత్‌రూమ్ శిథిలావస్థకు చేరడంతో బాలికలు ఇబ్బంది పడుతున్నారు. ప్యూరిఫైడ్ వాటర్ సిస్టం పనిచేయడం లేదు. భోజనశాల శ్లాబ్ లీక్ కావడంతో నీరు చేరుతోంది. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడంతో స్నానాలు చేసేందుకు అవస్థలు తప్పడం లేదు. వసతులు లేకపోవడంతో గతంలో 86 మంది ఉన్న విద్యార్థులు ప్రస్తుతం 36కు చేరారు.
- కొవ్వూరు మండలం సాంఘిక సంక్షేమ బాలురు వసతి గృహం, బీసీ సంక్షేమ బాలుర హాస్టల్, బీసీ బాలుర కళాశాల వసతి గృహాలతో పాటు వాడపల్లిలోని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల అద్దె భవనాల్లో అరకొర వసతులతో నడుస్తున్నాయి. కొవ్వూరులో ఎస్సీ, బీసీ హాస్టళ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో గత ఏడాది నుంచి అద్దె భవనాల్లో నడిపిస్తున్నారు. నెల రోజుల క్రితమే ఎస్సీ బాలుర వసతి గృహం అద్దె భవనంలోకి మారింది. అద్దె భవనాల్లో పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు, స్నానపు గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్కో హాస్టల్‌లో 100 మంది సామర్థ్యం ఉన్నప్పటికీ సౌకర్యాల లేమి, సొంత భవనాలు లేకపోవడం తదితర కారణాలతో సగం మంది కూడా చేరడం గగనంగా మారింది. అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు.

హైకోర్టు మార్గదర్శకాలు ఇలా..

సంక్షేమ వసతి గృహాల్లో ఉండాల్సిన వసతులపై ఇటీవల హైకోర్టు మార్గదర్శకాలు వెలువరించింది. వాటిని పరిశీలిస్తే..


- వసతి గృహం భవనం చుట్టూ సోలార్ ఎలక్ట్రికల్ ఫెన్సింగ్‌తో ప్రహరీ నిర్మించాలి. గేటు తప్పనిసరిగా ఉండాలి.
- విద్యార్థుల రాకపోకలు ఎంట్రీ, ఎగ్జిట్ రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి.
- హాస్టల్ ప్రవేశ మార్గం, కామన్ ఏరియాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
- మరుగుదొడ్లు శుభ్రంగా ఉండాలి. నీటి సదుపాయం కల్పించాలి.
- హాస్టల్లో పనిచేసే సిబ్బందికి ప్రవర్తనా నియమావళి నిర్దేశించాలి. విద్యార్థినులపై అసభ్య ప్రవర్తన, వేధింపులకు ఆస్కారం లేకుండా చూడాలి.
- జాతీయ శిశు సంరక్షణ ప్రమాణాలకు అనుగుణంగా హాస్టళ్లు ఉండాలి. ఇలా అనేక మార్గదర్శకాలు రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా ఒక్క వసతి గృహంలోనూ ఈ మార్గదర్శకాలు పూర్తి స్థాయిలో అమలవుతున్న దాఖలాలు లేవు.



ధవళేశ్వరం సమీకృత బాలుర వసతి గృహంలో తలుపులు, దోమ తెరలు లేని కిటికీలు



పెరవలి ఎస్సీ బాలుర వసతి గృహంలో తలుపులు లేని మరుగుదొడ్లు



నిడదవోలులోని సమిశ్రగూడెం ఎస్సీ బాలికల వసతి గృహంలో నిరుపయోగంగా ఫ్యాన్లు, లైట్లు

వంగలపూడి ఓపెన్ రీచ్ మూసివేత



వంగలపూడి ర్యాంపులో నిలచిన ఇసుక ఎగుమతులు

- అధిక ధరలకు ఇసుక విక్రయంపై జేసీ చినరాముడు ఆదేశం
- నిలచిన ఇసుక ఎగుమతులు



వంగలపూడి ఓపెన్ రీచ్‌ను మూసివేయాలని ఆదేశాలు ఇస్తున్న జేసీ చిన రాముడు

సీతానగరం: ఇసుక విక్రయాల్లో అధిక ధర వసూళ్లు, నిర్వహణ సరిగా లేకపోవడంతో వంగలపూడి ఓపెన్ రీచ్ మూసివేసినట్టు జేసీ చినరాముడు తెలిపారు. బుధవారం ర్యాంపులో నెలకొన్న వివాదంతో ఇసుక ఎగుమతులు నిలిచిపోయాయి. టన్ను రూ.70.19 వసూళ్లు చేయాల్సి ఉండగా రూ.270 నుంచి రూ. 300 వరకు వసూలు చేయడంతో ర్యాంపు నిర్వాహకులు, లారీ యజమానుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. లారీలపై ఇసుక ఎగుమతులు నిలిపివేయాలని లారీలను అడ్డుగా పెట్టడంతో స్టాక్ పాయింట్ వద్ద ఇసుక ఎగుమతులు నిలిచాయి. ఈ సమాచారం అందుకున్న జేసీ చిన రాముడు ర్యాంపు వద్దకు చేరుకుని ఇరు వర్గాలతో చర్చించారు. అధిక రేట్లకు ఇసుక విక్రయిస్తున్నారని జేసీకి ఫిర్యాదు అందడంతో ఆయన తక్షణమే వంగలపూడి ఓపెన్ రీచ్ 1, 2 లను మూసివేయాలని ఇసుక తవ్వకాలకు అనుమతులు పొందిన పాన్ ఇండియా ప్రాజెక్టుకు ఆదేశాలు ఇచ్చారు. త్వరలో మరో ఏజెన్సీ గుర్తించి ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. ఇసుకను ట్రాక్టర్లు, ఎండ్ల బడ్లపై ఉచితంగా తీసుకువెళ్లవచ్చునని ఆయన తెలిపారు. స్టాక్ పాయింట్ వద్ద ఉన్న ఇసుకను లారీలపై ఎగుమతి చేస్తారని, ఆన్‌లైన్‌లో చెల్లించిన నగదు తిరిగి బుక్ చేసిన వారికి అందజేస్తారని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆర్.కృష్ణ నాయక్, తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఇతర అధికారులు, బోట్స్‌మన్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

స్థూల మూల వేతనం ఇవ్వరూ..

కాంట్రాక్టు వైద్య ఉద్యోగుల వేడుకోలు



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న కాంట్రాక్టు వైద్య ఉద్యోగులు

రాజమహేంద్రవరం: తమను ఆదుకోవాలని కోరుతూ వైద్య, ఆరోగ్య శాఖ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగులు ఖాళీ ప్లేట్లతో అర్ధనగ్న ప్రదర్శన చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన నూరు శాతం జీతం జీఓ అమలు చేసి ఆదుకోవాలని మొరపెట్టుకున్నారు. ఈ మేరకు రాజమహేంద్రవరం ఆనం కళా కేంద్రానికి రీ ఒరియంటేషన్‌కు వచ్చిన ఉద్యోగులు భోజన విరామ సమయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ మాట్లాడుతూ అర్హత ఉన్నా ఎందరో కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ కాలేకపోయారన్నారు. తమ బతుకులకు భరోసా లేక పోయినా కనీసం ఉన్నంతలో సంతృప్తికర నూరు శాతం వేతనం అందించాలని వారు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. ఈ జీఓ అమలుకు అవసరమైతే మూకుమ్మడిగా అమరావతికి వెళ్లాలని యోచిస్తున్నట్టు ఆయన తెలిపారు. పదవీ విరమణ వయసు విషయంలోనూ తమకు తీరని అన్యాయం జరుగుతోందని, అందరికీ 62 ఏళ్లకు పదవీ విరమణ అయితే, తాము 60 ఏళ్లకే ఇంటికి వెళ్లిపోవాల్సి వస్తోందన్నారు. తమకూ 62 ఏళ్ల రిటైర్మెంట్ అవకాశం ఇవ్వాలని కోరారు.

ఎఫ్‌ఆర్‌ఎస్ పేరుతో ఇబ్బంది పెట్టొద్దు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: పారదర్శక హాజరు పేరుతో ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ పేర్కొంది. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తీర్మానించింది. బుధవారం బొమ్మూరులోని ఏపీజీఈఏ కార్యాలయంలో అసోసియేషన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎ.గిరిప్రసాద్ వర్మ అధ్యక్షతన జరిగింది. జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్‌పాల్ మాట్లాడుతూ జిల్లాలో మెడికల్ అండ్ హెల్త్ విభాగంలో బయోమెట్రిక్ (ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్) ఎఫ్ఆర్ఎస్ పేరుతో జీతాలకు హాజరు ముడిపెట్టి కోత పెడుతున్నారన్నారు. ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో ఉన్న సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించకుండా జీతాలు కోత పెట్టడాన్ని వారు ఖండించారు. జిల్లా కోశాధికారి కాకర్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ డిసెంబరు 14వ తేదీన జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు షరీఫ్, చాంబర్లీన్, దినేష్, రమేష్, కమల్‌సుందర్, డాక్టర్ శ్రీవల్లీ, పి.రవికుమార్ పాల్గొన్నారు.

29న లక్ష రుద్రాక్షార్చన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిన్న వెంకన్నబాబు స్వామిజీ తదితరులు

సీటీఆర్ఐ: గాదాల శ్రీ మహాలక్ష్మీ సమేత చిన్నవేంకటేశ్వరస్వామి పీఠంలోని శ్రీ చక్రవాహిని భద్రకాళి సమేత వీరేశ్వరస్వామికి కార్తిక మాస శివరాత్రి సందర్భంగా 29వ తేదీ తెల్లవారు జామున 4.30 గంటల నుంచి. ఏకముఖి నుంచి ద్వాదశముఖాలున్న 1,08,012 రుద్రాక్షలతో విశేష అర్చన నిర్వహించనున్నట్టు పీఠాధిపతి, గురుగోవింద, డాక్టర్ చిన్నవెంకన్నబాబు స్వామీజీ తెలిపారు. ఈ మేరకు బుధవారం దానవాయిపేటలో జరిగిన కార్యక్రమంలో పోస్టర్‌ని ప్రముఖ వెటర్నరి సర్జన్ డాక్టర్ అంచ రేవంత్‌తో కలిపి స్వామిజీ విడుదల చేశారు. స్వామీజీ మాట్లాడుతూ శివపంచాక్షరితో ముక్కంటిని అర్చించడం వల్ల కోటి జన్మల పాపం దగ్ధమవుతుందని అన్నారు. కార్యక్రమంలో మనగుడి-మనసేవ భారతీయ ఆధ్యాత్మిక సేవా సమితి జాతీయ చైర్ పర్సన్ ధరణీకోట దుర్గా వేంకట హేమవతి, ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్, రాష్ట్ర చైర్మన్ అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కెనరా బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం



భీమవరం కెనరా బ్యాంక్ కార్యాలయంలో రక్తదాన శిబిరం

భీమవరం: కెనరా బ్యాంక్ 119 వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం భీమవరం కెనరా బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంక్ సర్కిల్ ఆఫీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బీఎస్ అనంత పద్మారావు మాట్లాడుతూ బ్యాంక్‌ను అభివృద్ధి చేయడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా భీమవరం, రాజమహేంద్రవరంలో రక్తదాన శిబిరాల నిర్వహణతో పాటు తణుకులోని వృద్ధాశ్రమానికి రూ.50 వేల విలువైన సామగ్రి అందించామన్నారు. అనంతరం పలువురు ఖాతాదారులను సత్కరించారు.

జీఆర్టీ జ్యూయలర్స్ షోరూం ప్రారంభం



జీఆర్టీ జ్యూయలర్స్ కొత్త షోరూం

రాజమహేంద్రవరం సిటీ: జీఆర్టీ జ్యూయలర్స్ 61వ షోరూమ్‌ను బుధవారం రాజమహేంద్రవరం డీలక్స్ సెంటర్‌లో ప్రారంభించారు. జీఆర్టీ 60 ఏళ్లుగా నాణ్యత, విశ్వాసం, బలమైన ఉనికితో వ్యాపారాన్ని సాగిస్తుందని నిర్వాహకులు తెలిపారు. వివిధ ప్రాంతాల ప్రజల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేకంగా రూపొందించిన బంగారం, డైమండ్, ప్లాటినం, వెండి, జాతి రత్నాల ఆభరణాలను అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్టు వివరించారు. బంగారు ఆభరణాలపై గ్రాముకు రూ.50 తగ్గింపు, బంగారు ఆభరణాల వేస్టేజీపై 20 శాతం తగ్గింపు, డైమండ్ విలువపై క్యారెట్‌కు రూ.10 వేల తగ్గింపుతో అందిస్తున్నామన్నారు. కస్టమర్లు వెండి వస్తువులు పట్టీల మేకింగ్ చార్జీలపై 25 శాతం తగ్గింపు, అన్కట్ డైమండ్ విలువపై 10 శాతం తగ్గింపు అందిస్తున్నామని జీఆర్టీ జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ అనంత పద్మనాభన్ తెలిపారు. కార్యక్రమంలో జ్యూయలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిని గాయపరిచిన వ్యక్తిపై కేసు

కొత్తపల్లి: యువకుడిని గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బుధవారం స్థానిక పోలీసులు తెలిపారు. ఆ వివరాల్లోకి వెళితే.. అమీనాబాద్ గ్రామానికి చెందిన యువకుడు గంట శ్రీను ఆదివారం రాత్రి టిఫిన్ తెచ్చేందుకు సెంటర్‌లోకి వెళ్లాడు. అదే గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి శ్రీనును ఆపి నువ్వు ఎన్నిసార్లు చెప్పినా వైఎస్సార్ సీపీ టీషర్ట్స్ వేసుకుంటున్నావని, గతంలోనే హెచ్చరించినా బుద్ధి రాలేదా అంటూ అన్నాడు. దీంతో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. శ్రీనును రాజు తలపై గాయపరచగా, పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై బాధితుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

వేట నిషేధ సాయం ఏమైంది!

- ఎప్పుడిస్తారో తెలియక మత్స్యకారుల ఎదురుతెన్నులు
- నేడు ప్రపంచ మత్స్యకార దినోత్సవం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రోజూ సాగరంలో సమరం .. వేటే వారి జీవనాధారం.. వలకు చిక్కిన చేపలే ఆ మత్స్యకారుల జీవన గమనానికి ఆధారం.. అలాంటి సముద్ర వేటను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏటా ఏప్రిల్ 14 నుంచి రెండు నెలల పాటు నిషేధిస్తుంటాయి. ఆ నిషేధ సమయం 61 రోజులూ సాపాటు లేక మత్స్యకార కుటుంబాలు నానా అవస్థలు పడుతుంటాయి. ఈ ఏడాది నిషేధ సమయం ముగిసి ఆరో నెల వచ్చేసింది. ఆ సమయంలో చేసిన అప్పులు తీర్చలేక అవే ఇప్పుడు గుదిబండగా మారాయి. జగన్ ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఈ రోజు తమకు ఈ ఇబ్బందులు ఉండేవి కాదని, సముద్ర వేటపై ఆధారపడిన మత్స్యకారులు లబోదిబోమంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు 35 వేల కుటుంబాలకు వేట నిషేధ సమయంలో ఇచ్చే మత్స్యకార భరోసాకు కూటమి సర్కార్ మోకాలడ్డు పెట్టింది. అదే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా ఏటా వేట నిషేధ సమయం ముగియకుండానే పరిహారాన్ని అందజేసి మత్స్యకారులకు భరోసా కల్పించారు. గత ఐదేళ్లూ ఏటా మే లేదా జూన్ నెల దాటకుండానే వైఎస్సార్ మత్స్యకార భరోసా అందజేస్తూ వచ్చారు. మెకనైజ్డ్, మోటారు బోట్లపై సముద్రంలో చేపల వేటపై ఆధారపడిన ప్రతి కుటుంబానికి 61 రోజుల వేట నిషేధ సమయంలో వేట నిషేధ భృతిగా రూ.10 వేల చొప్పున వైఎస్సార్ మత్స్యకార భరోసా అందజేసింది. అటువంటిది కూటమి ప్రభుత్వం గద్దెనెక్కాక సమస్యలు మొదలయ్యాయని మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నెలలైనా ఏ ఒక్క మత్స్యకారుడి ఖాతాల్లో వేట నిషేధ భృతి జమ కాలేదని వాపోతున్నారు. 2014–19 మధ్య టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు వేట నిషేధ పరిహారం కుటుంబానికి కేవలం రూ.4 వేల చొప్పున అందజేసింది. ఇలా 2019 వరకూ 22,250 మందికి రూ 8.90 కోట్లు మాత్రమే పరిహారం ఇచ్చారు.



కాకినాడ తీరంలో లంగరేసిన బోట్లు

కాకినాడ జిల్లాలో..

తీర ప్రాంత మండలాలు	: 5
మత్స్యకార గ్రామాలు:	: 58
మెరైన్ ఫిషర్‌మెన్	: 2లక్షల మంది
సముద్ర వేట ద్వారా జీవనోపాధి	: 36,101 మంది
మెకనైజ్డ్ బోట్లు	: 467
మోటారు బోట్లు	: 3779
సంప్రదాయ బోట్లు	: 399

గత ప్రభుత్వంలో వైఎస్సార్ మత్స్యకార భరోసా

ఆర్థిక సంవత్సరం	లబ్ధిదారులు	మొత్తం (రూ.కోట్లలో)
2019–20	23,190	23.19
2020–21	24,587	24.58
2021–22	30,213	30.21
2022–23	21,394	21.39
2023–24	24,147	24.14

చోద్యం చూస్తున్న ప్రభుత్వం

కాకినాడ జిల్లాలో సుమారు 94 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది. తొండంగి, తుని రూరల్, ఉప్పాడ కొత్తపల్లి, కాకినాడ రూరల్, తాళ్లరేవు మండలాల పరిధిలో 1,95,184 మంది మత్స్యకారులు నివసిస్తున్నారు. ఇందులో సముద్రంలో చేపల వేటపై ఆధారపడి 36,101 మంది ఉపాధి పొందుతున్నారు. క్రమం తప్పకుండా గడచిన ఐదేళ్లు ఏటా మత్స్యకార భరోసాగా రూ.24 కోట్ల నుంచి రూ.30 కోట్ల నిషేధ భృతిగా 25 వేల నుంచి 30 వేల మంది మత్స్యకార కుటుంబాలకు నేరుగా సీఎం జగన్ బటన్ నొక్కి వారి వ్యక్తిగత ఖాతాలకు జమచేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వేట నిషేధ భృతికి అర్హులను మత్స్యశాఖ గుర్తించి నెలలు గడుస్తోంది.

గత మే నెలలోనే కాకినాడ జిల్లాలో 24,147 మత్స్యకార కుటుంబాలను భృతికి అర్హమైనవిగా ఎంపిక చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ముమ్మిడివరం, పి.గన్నవరం, రామచంద్రపురం, కొత్తపేట, అమలాపురం నియోజకవర్గాల్లో ఈ ఏడాది వేట నిషేధ భృతి కోసం 11,305 మందిని గుర్తించారు. ప్రతి కుటుంబానికి రూ.10 వేల చొప్పున అందించాలి. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో సుమారు 48 వేల కుటుంబాలకు వేట నిషేధ భృతి ఇవ్వాలి. ఇంకా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోంది.

నిరాశే మిగిలింది..



ప్రభుత్వ సాయం అందితే చేసిన అప్పులు తీర్చుకుందామనుకుంటే నిరాశే ఎదురైంది. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణలు స్పందించి వేట నిషేధ భృతిని అందజేయాలి. మత్స్యకారులను అన్నివిధాలా ఆదుకోవాలి.

–చెక్కా సూరిబాబు, ఉప్పలంక, కరప మండలం

'కూటమి' ప్రభుత్వంలో అన్యాయం



తాము అధికారంలోకి వస్తే మత్స్యకారులకు అండగా ఉంటామని హామీ ఇచ్చిన ఇప్పుడు ఆ మాట మార్చింది. మత్స్యకారులకు అన్యాయం చేస్తోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2019లో బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోయినా మత్స్యకారులకు ఇచ్చిన హామీ ప్రకారం మత్స్యకార భరోసా, డీజిల్ రాయితీ ఇచ్చింది. ఐదేళ్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు అండగా నిలిచారు.

–ఉమ్మిడి జాన్, మత్స్యకార నాయకుడు, మాజీ సర్పంచ్, ఉప్పాడ

ఇప్పుడు గాలికి వదిలేశారు



రెండు నెలల పాటు వేట నిషేధంలో జీవనోపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు మత్స్యకార భరోసా ఇవ్వకపోవడం అన్యాయం. గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా అందించారు. అంతకంటే ఎక్కువగా, గొప్పగా మత్స్యకారులను ఆదుకుంటామంటూ హామీ ఇచ్చి ఇప్పుడు గాలికి వదిలేశారు.

–ఎం.ఎల్లాజీ, ఎంపీటీసీ సభ్యుడు, ఉప్పాడ

తగిన చర్యలు తీసుకోవాలి



వేట నిషేధ సమయంలో ఇంటి వద్దే ఉన్నాం. గత ప్రభుత్వంలో మత్స్యకార భరోసా వచ్చేది. దీంతో ఆర్థికంగా ఇబ్బంది ఉండేది కాదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలలైనప్పటికీ ఇప్పటికీ భరోసా వేయలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి.

–బర్రే రాంబాబు, బలుసుతిప్ప, కాట్రేనికోన మండలం

ఉరుకులు... పరుగులు

- రైల్వే స్టేషన్‌లో భీతావహం
- రైలు పట్టాలు తప్పిందని హడావుడి
- మాక్‌డ్రిల్‌తో అవగాహన కల్పించిన అధికారులు
- ఎలా రక్షించాలో చూపించిన ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలు

రాజమహేంద్రవరం సిటీ: ఏం జరిగిందో తెలియదు.. అంతా హడావుడి.. ఒక్కసారిగా అధికారుల ఉరుకులు, పరుగులు.. ఈ పరిణామాలతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో భీతావహ పరిస్థితి.. స్టేషన్‌లోని కోల్ యార్డ్ వద్ద రైలు పట్టాలు తప్పిందని తెలియడం, ఒక్కసారిగా ఆ రైలులోని ప్రయాణికులు భయంతో కేకలు వేయడం.. సంఘటనా స్థలానికి రైల్వే ఎన్డీఆర్‌ఎఫ్ బృందం, వైద్య అధికారులు, రెవెన్యూ, పోలీస్, తదితర శాఖల సిబ్బంది కంగారుగా వెళ్లడం.. రైలు బోగీల్లో చిక్కుకున్న ప్రయాణికులను రక్షించేందుకు అత్యాధునిక కట్టర్లు ఉపయోగించి బోగీ కిటికీలను కట్ చేయడం .. అందులోంచి ప్రయాణికులను బయటకు లాగి, రోప్ ద్వారా సురక్షితంగా తీసుకురావడం చూసి స్టేషన్ వద్ద ప్రయాణికులు వామ్మో అనుకున్నారు. చివరికి ఇదంతా రైల్వే ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా నిర్వహించిన మాక్ డ్రిల్ అని తెలియడంతో ఊపిరి పీల్చుకున్నారు. రైలు ప్రమాదాల సమయంలో ప్రాణ నష్టాన్ని తగ్గించడానికి సాధ్యమైనంత తక్కువ సమయంలో త్వరితగతిన రెస్క్యూ కార్యకలాపాలను ఏ విధంగా చేపట్టాలనే అంశాలపై రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్‌పీఏఆర్‌ఎంవీ సిబ్బంది నిర్వహించిన మాక్ డ్రిల్ ఆద్యంతం కళ్లకట్టినట్టు అయ్యింది. విజయవాడ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఆపరేషన్స్) శ్రీనివాస రావు కొండ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక రైల్వే స్టేషన్ కోల్ యార్డ్‌లో ఎన్డీఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్, వివిధ శాఖల అధికారులతో కలసి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రావు కొండ మాట్లాడుతూ ప్రయాణాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. దీనిపై మెకానికల్, సేఫ్టీ, మెడికల్, ఎస్అండ్‌టీ విభాగాల్లోని సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన అంశాలను తెలియజేస్తున్నామన్నారు. ప్రమాద సమయంలో రెస్క్యూ కార్యకలాపాలను చేపట్టడానికి త్వరితగతిన స్పందించే విధంగా విజయవాడలోని ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్‌పీఏఆర్‌ఎంవీ సిబ్బంది మాక్‌డ్రిల్‌ను సమర్థంగా నిర్వహించారన్నారు. జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాములు మాట్లాడుతూ రైలు ప్రమాదాల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారిని కాపాడేందుకు అత్యవసరంగా చేపట్టాల్సిన చర్యలను మాక్‌డ్రిల్ ద్వారా కళ్లకు కట్టినట్లు చూపించడం అభినందనీయమన్నారు. ప్రయాణికులకు రక్షించి సమీప ఆసుపత్రులకు ఎలా తరలిస్తారో చూపారన్నారు. మొత్తం 100 మంది రైల్వే సిబ్బంది రెస్క్యూ, పునరుద్ధరణ కార్యకలాపాల్లో పాల్గొని సమర్థంగా చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారి బి.ప్రశాంతకుమార్, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



మాక్ డ్రిల్‌ను పర్యవేక్షిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు



బోగీ కిటికీని యంత్రం సహాయంతో కట్ చేస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది



గాయపడిన ప్రయాణికుడిని రక్షించి బయటకు తీసుకు వస్తూ..



ప్రయాణికుడిని రక్షించి రోప్ సహాయంతో కిందకు దించే విధానం



అంబులెన్స్‌లో ప్రమాద బాధితుల తరలింపు



పట్టాలు తప్పిన బోగీని తిరిగి పట్టాలు ఎక్కించే ప్రయత్నం చేస్తున్న రైల్వే సిబ్బంది

నూతన పద్ధతులపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలి

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వాణిజ్య పంటల సాగులో జన్యుపరమైన నూతన పద్ధతులు, కొత్త రసాయనాలు, విలువ జోడింపుపై శాస్త్రవేత్తలు దృష్టి సారించాలని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ (సీటీఆర్‌ఐ) డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ సూచించారు. బుధవారం స్థానిక సీటీఆర్‌ఐలోని సమావేశ మందిరంలో మూడో రోజు పరిశోధన కమిటీ సమావేశాలు ఆయన అధ్యక్షతన జరిగాయి. దీనికి డాక్టర్ ఎం.శేషు మాధవ్, బెంగళూరు ఐఐహెచ్‌ఆర్ ఫార్మర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సీకే నారాయణ, సీటీఆర్‌ఐ ఫార్మర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సీవీ నరసింహారావు, హైదరాబాద్ ఐఐసీటీ చీఫ్ సైంటిస్ట్ బీవీ సుబ్బారెడ్డి, సీటీఆర్‌ఐ ఫార్మర్ డివిజన్ హెడ్ సి.చంద్రశేఖరరావు నిపుణులుగా వ్యవహరించారు. ఈ సమావేశంలో శాస్త్రవేత్తలు ఎల్‌కే ప్రసాద్, అనిందిత పాల్, కె.సుమన్ కళ్యాణి, ఎం.అనురాధ, నమితాదాస్ సాహా తమ పరిశోధనా ఫలితాలను వివరించారు. వాణిజ్య పంటల సాగులో కొత్త రసాయనాలు, విలువ జోడింపు పరిశోధనలపై చర్చించారు. ఆముదం నూనె నుంచి 2–ఆక్టనాల్ వెలికితీత, వర్జీనియా పొగాకులో పిలకలను అరికట్టడానికి కొత్త రసాయనాలు, అశ్వగంధలో బయో యాక్టివ్ కాంపౌండ్లు, పురుగు మందుల అవశేషాలను గుర్తించే విశేష పద్ధతులు వంటి పరిశోధనలపై పురోగతిని తెలిపారు. పసుపు, మిరపను ఉపయోగించి విలువ ఆధారిత ఉత్పత్తులు, వాటి ప్రయోజనాలు వివరించారు. అనంతరం సాంకేతిక సమావేశాలకు నిపుణులుగా హైదరాబాద్ ఐఐఆర్ ఫార్మర్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ ఎం.సుజాత, సీటీఆర్‌ఐ ఫార్మర్ డైరెక్టర్ టీజీకే మూర్తి వ్యవహరించారు. సమావేశంలో శాస్త్రవేత్తలు కె.సరళ, సి.నంద, కె.గంగాధర్, పి.మణివేల్, జేజే రాజప్ప తమ పరిశోధనా ఫలితాలను తెలిపారు. వాణిజ్య పంటల్లో జన్యు మెరుగుదల, నూతన పద్ధతులు, వంగడాల్లో అధిక దిగుబడి, అధిక నాణ్యతను పెంపొందించడం, వ్యాధి నిరోధక వంగడాలపై జరుగుతున్న పరిశోధనల ఫలితాలను నిపుణులు చర్చించి సలహాలు, సూచనలను అందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీటీఆర్‌ఐ డైరెక్టర్ మాగంటి శేషుమాధవ్

తప్పిపోయిన మహిళ బంధువుల చెంతకు

అన్నవరం: బంధు మిత్రులతో కలసి తీర్థయాత్రలు చేస్తూ అన్నవరం రైల్వే స్టేషన్‌లో దిగి తప్పిపోయి రెండ్రోజులుగా ఇబ్బంది పడుతున్న ఖర్నూల్ జిల్లా రాయచూర్‌కు చెందిన గుర్రం లక్ష్మీదేవిని బంధువులకు అప్పగించినట్లు అన్నవరం రైల్వే స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ త్రినాథరావు తెలిపారు. బుధవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాయచూర్‌కు చెందిన గుర్రం లక్ష్మీదేవి తన బంధువులు, కుటుంబ సభ్యులతో తీర్థయాత్రలు చేస్తూ సోమవారం అన్నవరం రైల్వే స్టేషన్‌లో దిగిపోయింది. ఆమె తన బంధు మిత్రులను కలుసుకునేందుకు రెండ్రోజులుగా ప్రయత్నిస్తుంది. అయితే ఆమె బంధువులు సామర్లకోట, విశాఖపట్నం రైల్వే స్టేషన్లలో ఆమె కోసం గాలిస్తున్నారు. కాగా, బుధవారం అన్నవరం రైల్వే స్టేషన్‌లో బంగారు ఆభరణాలు ధరించి లగేజీ బ్యాగ్‌తో తిరుగుతున్న ఆమెను రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ త్రినాథరావు విచారించగా తన వివరాలు తెలిపింది. దీంతో తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాస్‌కు విషయం తెలియజేయగా ఆయన సూచనలు మేరకు ఆమె బంధువులకు సమాచారం ఇచ్చారు. బుధవారం బంధువులు అన్నవరం రైల్వే స్టేషన్‌కు రాగా గుర్రం లక్ష్మీదేవిని వారికి అప్పగించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.



లక్ష్మీదేవిని బంధువులకు అప్పగిస్తున్న రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యామ్ త్రినాథరావు

చాగల్లు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వీర్రాజు సస్పెన్షన్

చాగల్లు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈ.వీర్రాజును సస్పెండ్ చేసినట్టు జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావు బుధవారం తెలిపారు. హెచ్‌ఎం వీర్రాజు విధుల్లో అలసత్వం వహించడంతో పాటు అనర్హులకు టీసీలు విక్రయించారని నిర్ధారించడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. గతేడాది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించిన వీర్రాజు సస్పెండ్‌తో ఆందోళన నెలకొంది.

బంగారం షాపు గుమస్తా చేతివాటం

నిడదవోలు: గోల్డ్ టెస్టింగ్ షాపులో ఏడాదిన్నరగా నమ్మకంగా పని చేస్తున్న ఓ గుమస్తా చేతివాటం ప్రదర్శించాడు. చివరకు పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. నిడదవోలులో సీఐ పీవీజీ తిలక్ బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. మహారాష్ట్ర రాజ్యవేడి గ్రామానికి చెందిన బంగారు వ్యాపారులు ప్రశాంత్, నేతాజీలు 20 ఏళ్ల కిందట ఆంధ్రాకు వచ్చారు. ఇందులో వ్యాపారి ప్రశాంత్ రాజమహేంద్రవరంలో డీకే గోల్డ్ టెస్టింగ్ షాపు, మరో వ్యాపారి నేతాజీ తాడేపల్లిగూడెంలో జేపీ గోల్డ్ టెస్టింగ్ షాపులు నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరంలో డీకే గోల్డ్ టెస్టింగ్ బంగారు షాపులో అమర్ గుమస్తా ఏడాదిన్నరగా పని చేస్తున్నాడు. అయితే తాడేపల్లిగూడెం షాప్‌లో పని చేస్తున్న సాగర్ అనే వ్యక్తి పనిచేయడం మానేయడంతో 15 రోజుల కిందట గుమస్తా అమర్‌ను తాడేపల్లిగూడెం షాపునకు పనికి పంపించారు. ఈ క్రమంలో జల్సాలకు అలవాటు పడిన అమర్‌కు దురాశ కలిగింది. బంగారాన్ని కాజేసి ఎవరికి చెప్పకుండా మహారాష్ట్ర వెళ్లిపోయి తనకు ఉన్న అప్పులు తీర్చి జీవిద్దామని పథకం వేశాడు. తాడేపల్లిగూడెం షాపు యజమాని నేతాజీ ఈ నెల 13న రాత్రి రాజమహేంద్రవరం షాపునకు తీసుకు వెళ్లాలని సుమారు 289.340 గ్రాముల గోల్డ్ కచ్చా ముక్కలు, రూ. 6.30 లక్షల నగదును అమర్‌కు ఇచ్చాడు. వాటిని తీసుకుని ఈనెల 14న అతను మోటార్ సైకిల్‌పై బయలు దేరాడు. అమర్ ముందుగా వేసుకున్న పథకం ప్రకారం నిడదవోలు పట్టణంలోని ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద రోడ్డు పక్కన తుప్పల్లో బంగారం, నగదును దాచాడు. తర్వాత తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న తనను గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు అడ్డగించి కత్తి చూపించి బెదిరించి బంగారం, నగదు దోపిడీ చేశారని గుమస్తా అమర్ కట్టుకథ అల్లాడు. ఈ ఘటనపై తాడేపల్లిగూడెం షాపు యజమాని నేతాజీ నిడదవోలు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చివరకు బుధవారం అమర్‌ను అరెస్టు చేసి, మొత్తం సొత్తు రికవరీ చేశారు. పట్టణ ఎస్సై శోభన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమర్ నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు

సుబ్బంపేటలో బాలిక మృతి

కొత్తపల్లి: వైద్యం వికటించి తమ కుమార్తె మృతి చెందినట్లు ఉప్పాడ శివారు సుబ్బంపేటకు చెందిన మైలపల్లి మల్లేశ్వరి తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. మైలపల్లి అక్షయ (16) తొమ్మిదో తరగతి చదువుతుంది. సోమవారం రాత్రి జ్వరంతో పాటు వాంతులు కావడంతో మంగళవారం ఉదయం ఉప్పాడలోని ఆర్‌ఎంపీ మామిడి సూరిబాబు వద్దకు తల్లి మల్లేశ్వరి తీసుకువెళ్లింది. అక్కడ ఆసుపత్రిలో అక్షయకు మూడు ఇంజక్షన్లు, సిలెన్‌లు, ఆక్సిజన్ పెట్టారు. తర్వాత మాత్రలు ఇచ్చి ఇంటికి తీసుకు వెళ్లాని ఆర్‌ఎంపీ సూరిబాబు చెప్పారని బంధువులు అంటున్నారు. పాపకు బాగోలేదని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లండనే మాట చెప్పకుండా తీసుకువెళ్లమనడంతో ఇంటికి తీసుకొచ్చిన క్షణాల్లో అక్షయ స్పృహ కోల్పోవడంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లేలోగా ప్రాణాలు విడిచినట్లు మల్లేశ్వరి కన్నీటి పర్యంతమయ్యారు. ఈ విషయమై ఆర్‌ఎంపీ సూరిబాబును వివరణ కోరగా అక్షయ తన వద్దకు వచ్చేసరికే ఆరోగ్యం బాగోలేదని, ఆమెకు ఎటువంటి వైద్యం చేయలేదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లమని చెప్పానని అన్నారు. అయితే దీనిపై ఏవిధమైన సమాచారం లేదని ఎస్సై వెంకటేష్ తెలిపారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు



అక్షయ (ఫైల్)